సాక్షి
గుంటూరు

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023




లక్ష్మీ నృసింహస్వామి ఆదాయం

మంగళగిరి : శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారికి రూ. 45,21,877 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి శనివారం తెలిపారు.



కోటయ్య హుండీ ఆదాయం ..

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారికి హుండీల ద్వారా రూ.51,43,869లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

జగనన్న ఆరోగ్య సురక్ష చారిత్రాత్మకం

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- ఇజ్రాయిల్ పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం

పట్నంబజారు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకమని, ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైనదిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఇజ్రాయిల్ పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను నగర కమిషనర్ కీర్తి చేకూరి, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ ప్రారభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ వైద్య పరీక్షలతో పాటుగా అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా మెరుగైన చికిత్స, మందులు అందించడం జరుగుతుందన్నారు. కంటికి సంబంధించిన వైద్య సేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ నగరంలోని 29 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో క్యాంప్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్ తో పాటుగా ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకొని, అవసరమైతే అందుబాటులోని హాస్పిటల్‌ల్లో చేర్పి చికిత్స అందిస్తారని, ఆరోగ్య శ్రీ ద్వారా కూడా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ కని విని ఎరుగని రీతిలో పరిపాలన, వైద్యాన్ని ప్రజల గడప వద్దకు తీసుకుని వెళ్లిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.వె వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ పేద వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందనారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, కార్పొరేటర్ మర్రి అంజలి, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి కేస్ షీట్ అందిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, కమిషనర్ కీర్తి చేకూరి, షేక్ నూరిఫాతిమా, డిప్యూటీ మేయర్ సజిల



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యురాలు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రక్త పరీక్ష చేస్తున్న నర్సింగ్ విద్యార్థులు



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను చిన్నారి తల్లికి అందజేస్తున్న వైద్య సిబ్బంది

6,470 మందికి వైద్య సేవలు

గుంటూరు మెడికల్: ప్రతి ఇంటికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు ప్రారంభమాయ్యాయి. చేబ్రోలు, పెదకాకాని, పొన్నూరు, మంగళగిరి, దుగ్గిరాల, కాకుమాను, పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, తెనాలి, కొల్లిపర, మేడికొండూరు, ఫిరంగిపురం, తాడికొండ మండలాల్లో జరిగిన ఉచిత వైద్య శిబిరాల్లో సాయంత్రం 6 గంటలకు 5,057 మంది రోగులు వైద్య సేవలు పొందారు. వీరిలో 132 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. గుంటూరు, పొన్నూరు అర్బన్ పీహెచ్‌సీల్లో జరిగిన వైద్య శిబిరాల్లో 1,413 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో పది మందిని శస్త్రచికిత్సల నిమిత్తం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. తొలిరోజు జరిగిన వైద్య శిబిరంలో విశేష స్పందన లభించిందని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఆదివారం , సోమవారం సెలవు దినాలను మంగళవారం ఉచిత వైద్య శిబిరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతోందని వెల్లడించారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా టీటీకే రెడ్డి



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ తేలుకుట్ల త్రిపురాంతకేశ్వర రెడ్డి శనివారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కుసుమ జీవన్ ప్రదీప్ ఉద్యోగ విరమణ చేయడంతో టీటీకే రెడ్డిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ డీఎంఈ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ టీటీకే రెడ్డి ప్రస్తుతం వైద్య కళాశాల ఫోరెన్సిక్ వైద్య విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాలలో 1981లో ఎంబీబీఎస్, 1993లో పీజీ వైద్య విద్యను ఆయన పూర్తి చేశారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో 1997లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించారు. అనంతరం గుంటూరు వైద్య కళాశాలకు బదిలీ అయి 2003లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2008లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. గుంటూరు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా 2020 నుంచి 2022 వరకు పనిచేశారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ టీటీకే రెడ్డిని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ ఉమాజ్యోతి, పలువురు కార్యాలయ ఉద్యోగులు, వైద్యులు, తదితరులు అభినందించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 3800 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 206 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1001 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 550 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 120 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 280 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 760 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

గుంటూరు రూరల్: నల్లపాడులోని ఎమ్‌బీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలలో డిప్లమో కోర్సులకు మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి. శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఉదయం 9–30 గంటలకు కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయన్నారు. పాలిసెట్-2023లో అర్హత సాధించినా, సాధించకపోయినా ఆసక్తిగల విద్యార్థులు తమ పదవ తరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, రూ.5,800 ఫీజు చెల్లించి అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు.

గణనాథుని లడ్డూ రూ.8,11,111



గుంటూరు రూరల్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్–2 శ్రీరాంనగర్ 11వ లైనులో గణనాథునికి ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి లడ్డూ ప్రసాదం విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా నగరాలు డివిజన్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆరిక శ్రీనివాసరెడ్డి, చల్లా బసివిరెడ్డి, మున్నంగి సాయిసుందర్‌రెడ్డి, పొన్నపాటి శ్రీకాంత్‌రెడ్డిలు 8,11,111 రూపాయలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి ప్రసాదం లడ్డూతో ఊరేగింపుగా భక్తుని ఇంటికి చేర్చారు. అనతరం స్వామి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా చేశారు.

126 కేజీల శివలింగాకార లడ్డూ



అద్దంకి రూరల్: వినాయక పందిరిలో ప్రసాదంగా ఉంచేందుకు అద్దంకిలోని నవయుగ స్వీట్ షాప్ యజమానులు వెంగళరావు, హనుమాన్ సిబ్బంది 126 కేజీల శివలింగాకారంలో లడ్డూను తయారు చేశారు. కాజు, బాదం, డ్రై ఫ్రూట్స్ ఉపయోగించి మూడు అడుగుల ఎత్తులో ఆకర్షణీయంగా తయారు చేశారు.

రేపు తెనాలిలో త్రోబాల్ రాష్ట్ర జట్ల ఎంపిక

తెనాలి: ఆంధ్రప్రదేశ్ పురుషులు మహిళల త్రోబాల్ జట్ల ఎంపిక అక్టోబరు 2వ తేదీన తెనాలిలో జరగనుంది. ఇక్కడి బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ క్రీడామైదానంలో ఉదయం 10 గంటలకు జట్ల ఎంపిక జరుగుతుందని త్రోబాల్ అసోసియేషన్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపికైన జట్లు అక్టోబరు 22, 23, 24 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటాయని వివరించారు.

2న పోలీస్ స్పందన రద్దు

నగరంపాలెం: ఈనెల 2న మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరగాల్సిన స్పందనను తాత్కలికంగా రద్దు చేసినట్లు కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు గమనించాలన్నారు.

జిల్లా కోర్టులో స్వచ్ఛత హీ సేవ

గుంటూరు లీగల్: న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది, న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు కోర్టులో స్వచ్ఛత హీ సేవకు శనివారం జయహో పలికారు. కోర్టు ప్రాంగణంలోని అణువు అణువుని శుభ్రం చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మొబైల్ కోర్టు నుంచి కొత్త బిల్డింగ్‌లోని ప్రతి కోర్టుని ప్రత్యక్షంగా పరిశీలించారు. కోర్టు ప్రాంగణంలో అపరిశుభ్రంగా ఉన్న చెత్తాచెదారాన్ని న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు తొలగించగా, కోర్టు సిబ్బంది వారి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసుకున్నారు. మొబైల్ కోర్టు న్యాయమూర్తి జి.స్రవంతి ఆధ్వర్యంలో సిబ్బంది కోర్టు పరిసర ప్రాంతాల్లోని పిచ్చిమొక్కలను తొలగించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వినియోగదారుల కమిషన్ పరిసర ప్రాంతాల్లో దట్టంగా పెరిగిన పిచ్చిచెట్ల కొమ్మలను పీడీజే పార్థసారధి ఆధ్వర్యంలో ఆయా కార్యాలయ సిబ్బంది, న్యాయవాదులు తొలగించారు. గవర్నమెంట్ ప్లీడర్ పోకల వెంకటేశ్వరరావు కార్యాలయం వెనుక ఉన్న పిచ్చి మొక్కలను ఆయన ఆధ్వర్యంలో న్యాయవాదులు తొలగించారు. జిల్లా, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు, కాపీ సెక్షన్, రికార్డ్ రూంలను ఆయా కార్యాలయాల సిబ్బంది శుభ్రం చేసుకుని స్వచ్ఛతకు జయహో పలికారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి సీహెచ్ రాజగోపాలరావు, గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీకే సురేష్, బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, సీనియర్ న్యాయవాదులు లావు అంకమ్మ చౌదరి, సాయి వర ప్రసాద్, కొండవీటి శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లా న్యాయమూర్తి పార్థసారథి ఆధ్వర్యంలో జరుగుతున్న స్వచ్ఛత కార్యక్రమం

షెడ్యూల్ ప్రకారం నిర్మాణాలు

జేఎన్‌టీయూ–ఎన్ నిర్మాణ ప్రగతిపై ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి సమీక్ష

నరసరావుపేటరూరల్: షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ నెలకు జేఎన్‌టీయూ నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణాలను పూర్తిచేయాలని రాష్ట ఉన్న త విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి సూచించారు. కాకాని వద్ద నిర్మాణంలో ఉన్న జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాల భవనాలను ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఎమ్మె ల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జేఎన్‌టీయూ కాకినాడ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజులు శనివారం సందర్శించారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. హాస్టల్ భవనాలు, రోడ్లు, డ్రెయిన్‌లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో మెకానికల్, ఈసీఈ, ఎలక్ట్రికల్ ల్యాబ్‌లను ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

అత్యుత్తమ నైపుణ్యాలతో ఉన్నతస్థాయికి..

అత్యుత్తమ నైపుణ్యాలు, దృఢనిశ్చయంతో విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన 26వ ఓరియంటేషన్ డే, గ్రాడ్యుయేషన్ డేల్లో ఆయన పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి, పొడా వైస్ చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో 'స్వచ్ఛత హీ సేవ'

గుంటూరు వెస్ట్: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీల్లో గుర్తించిన ప్రాంతంలో అక్టోబరు 1 ఉదయం 10 గంటలకు జాతిపిత మహాత్మాగాంధీకి నివాళిలో భాగంగా ఆయన్ను స్మరించుకుంటూ ఒక గంట శ్రమదానం నిర్వహించాలని పంచాయతీ రాజ్ శాఖ డీపీఓ కేశవరెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా రెండు ప్రాంతాల్లో శ్రమదానం నిర్వహించేందుకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు స్వచ్ఛత హీ సేవ పోర్టల్‌లో ఈవెంట్స్ నమోదు చేశారన్నారు. పరిశుభ్రత కోసం ఒక గంట పాటు ఉదయం 10 గంటల నుంచి గుర్తించిన ప్రాంతాలలో శ్రమదానం నిర్వహించాలన్నారు. జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇతర ప్రముఖులతో ఆదివారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మండల విస్తరణాధికారులు (పీఆర్ అండ్ ఆర్డీ) ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎస్‌హెచ్‌జీ, వలంటీర్‌లు, ఆర్‌డబ్ల్యూఏఎస్ మార్కెట్ అసోసియేషన్, ఎన్‌వైకే వలంటీర్‌లు, ప్రజాప్రతినిధులు, మండలాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు పాల్గొనే విధంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఆదేశించారు.

పాలు పాడవడం అవాస్తవం

- పచ్చపత్రికలో తప్పుడు కథనాలు
- ఖండించిన ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫెడరేషన్ లిమిటెడ్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గర్భిణులు, బాలింతలకు పాడైన పాలు అంటూ ఈనాడు పత్రిక ఒక అసత్య కథనాన్ని వండి వార్చింది. ఈ నెల 6వ తేదీన కర్ణాటకలోని మెగా డెయిరీ నుంచి సరఫరా చేయగా ఎనిమిదిన తెనాలిలో స్టాక్‌పాయింట్‌కు అవి చేరుకున్నాయి. అందులో 250 ప్యాక్‌లు బ్యాచ్ నెంబర్ సీహెచ్/246 కొల్లిపర చేరుకోగా వాటిని 44 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఇవన్నీ కూడా ఫ్లెక్సీ ప్యాకింగ్‌లో వచ్చాయి. కేసన నాగమణి అనే గర్భిణికి, ఆమె మూడేళ్ల చిన్నారికి కలిపి 15 ప్యాకెట్లు అందించారు. అందులో మూడు ఉబ్బడంతో వాటిని వెంటనే మార్చడం జరిగింది. ఇది కాకుండా ఎక్కడా ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ఆ బ్యాచ్ పాలను పరీక్షలకు పంపగా మంచి క్వాలిటీతో ఉన్నట్లు నివేదిక వచ్చింది. అయితే రీఫిల్ ప్యాక్‌లో వచ్చాయని, అవి పాడైపోయాయని గర్భిణులు, బాలింతలకు చెడిపోయిన పాలు అందిస్తున్నారంటూ ఈనాడు కథనంలో పేర్కొన్నారు. దీన్ని ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫెడరేషన్ లిమిటెడ్ అధికారులు ఖండించారు.

- కార్పొరేషన్ ద్వారా ప్రతి నెలా 90 లక్షల లీటర్ల విటమిన్–ఎ, విటమిన్–డి ఉన్న అల్ట్రా హీట్ ట్రీటెడ్ డబుల్ టోన్డ్ పాలను 55,607 అంగన్‌వాడీలకు సరఫరా చేస్తోంది. ఈ పాలను టెట్రా ప్యాక్, ఫ్లెక్సీ ప్యాక్ తరహాలో రెండు విధాలుగా ప్యాక్ చేస్తారు. ఫ్లెక్సీ ప్యాక్‌ను ఏడు పొరలతో కూడిన ఫుడ్ గ్రేడ్ థెర్మోప్లాస్టిక్ కాపాలిమెర్ ఫిల్మ్ తోనూ, టెట్రా ప్యాక్‌ను నాలుగు పొరల ఫుడ్ గ్రేడ్ పాలిథిన్, పేపర్‌బోర్డు, అల్యూమినియం ఫాయిల్‌తో 90 నుంచి 180 రోజుల వరకూ నిల్వ ఉండేలా తయారు చేస్తారు. ఈ అల్ట్రా హీట్ ట్రీటెడ్ ప్యాక్‌లో అత్యుత్తమ క్వాలిటీ ఉన్న పాలను మాత్రమే ప్యాక్ చేస్తారు. ఈ ప్రాసెస్ మొత్తం ఒక పద్ధతి ప్రకారం స్టెరైల్ కండీషన్‌లో జరుగుతుంది. ఈ విధంగా ప్యాకింగ్ జరిగిన తర్వాత ఐదు రోజుల పాటు ఇంక్యుబేషన్‌లో పెట్టి దాని క్వాలిటీని పరీక్షించిన తర్వాతే బయటకు పంపుతారు. ప్రతి ప్యాక్ మీద ఉబ్బిన, లీక్ అయిన ప్యాకెట్లను వినియోగించవద్దని ఇన్‌స్ట్రక్షన్స్ కూడా ప్రచురించారు.
- 2017–18 సంవత్సరంలో ప్రతి నెలా 25 లక్షల లీటర్ల పాలు బాలింతలకు, గర్భిణులకు, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పంపిణీ జరిగేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గర్భిణులు, బాలింతలతో పాటు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకూ వయస్సు ఉన్న 13 లక్షల మంది పిల్లలకు, 3 నుంచి ఆరు సంవత్సరాల మధ్య ఉండి ప్రీ–స్కూల్‌కు వెళ్లే తొమ్మిది లక్షల మంది పిల్లలకు కూడా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలు ఉచితంగా అందిస్తున్నారు. ఇదే కాకుండా 77 షెడ్యూల్డ్ మండలాల ద్వారా ప్రతి రోజు 200 ఎంఎల్ పాలను వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తున్నారు. దీంతో 25 లక్షల లీటర్ల నుంచి నెలకు 90 లక్షల లీటర్లకు పెరిగింది. ఈ 90 లక్షల లీటర్లలో 40 శాతం ఫ్లెక్సీ ప్యాక్‌లు కాగా 60 శాతం టెట్రా ప్యాకులుగా సరఫరా చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పంపిణీ చేస్తున్న పాలు మొత్తం సురక్షితమైనవేనని తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని అధికారులు కోరారు.

నిమ్మకాయల ధర



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,500, గరిష్ట ధర రూ.4,500, మోడల్ ధర రూ.3,200 వరకు పలికింది.

వైద్య కళాశాలలో ర్యాగింగ్‌పై విచారణ

గుంటూరు మెడికల్: స్థానిక వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారంటూ ప్రథమ ఏడాది విద్యార్థి నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. శుక్రవారం విచారణ చేయాలంటూ మెయిల్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. అయితే ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌ప్రదీప్ ర్యాగింగ్ జరగలేదని నివేదిక ఇచ్చారు. శనివారం మళ్లీ విచారణ చేపట్టగా కళాశాల సమీపంలోని కన్నావారితోటలో ప్రైవేటు వసతి గృహాల్లో ఉంటున్న ఓ విద్యార్థిని ఐదుగురు సీనియర్ వైద్య విద్యార్థులు ర్యాగింగ్ చేసినట్లు తెలుసుకుని సదరు విద్యార్థులను యాంటి ర్యాగింగ్ కమిటీ సభ్యులు విచారించారు. లిఖిత పూర్వకంగా వారి వద్ద రాయించుకుని గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు.

టేబుల్ టెన్నిస్ జట్లు ఎంపిక

నగరంపాలెం: రాష్ట్ర, అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ పోటీలకు గుంటూరు జిల్లా జట్టును జిల్లా టేబుల్ టెన్నిస్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గురుదత్, రామసీతా శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అనంతపురం జిల్లాలో ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీలకు హాజరు కానున్నట్లు చెప్పారు.

వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం జిల్లా కమిటీ

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా డాక్టర్ల విభాగం కమిటీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గుంటూరు జిల్లా డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా యాకూబ్ షేక్, ఉపాధ్యక్షుడిగా చిలుకా కోటేశ్వరరావు, ఆర్.బాలకృష్ణనాయక్, ప్రధాన కార్యదర్శులు రావి ప్రియదర్శిని, మొహమ్మద్ ఆయేషా, దేవరపల్లి వంశీకృష్ణ, లక్కి కోటేశ్వరరావు, బి.వీరశేఖరరావు, తాడికొండ వెంకయ్య, పువ్వాడ సోమశేఖరరావును నియమించారు. సహాయ కార్యదర్శులుగా మొహమ్మద్ షరీఫ్, తేలుకుట్ల వెంకటేశ్వర్లు, ఎన్.రాజేష్‌రోషన్, మల్లెల దిలీప్ కుమార్, వై.శివనాగరాజు, చింతలపూడి అశోక్, చింతల రత్నరాజు, పెదపల్లి జనార్ధన్‌రావు, చిలుకా లక్ష్మారావు, వి.రాజశేఖర్, బి.హృదయరాజు, డి.రాయప్ప, కె.కౌశిక్, జి.సుబ్రహ్మణ్యలను నియమించారు. కార్యదర్శులు షేక్ ఇర్ఫాన్, జి.ఓంకారయప్ప, మొహమ్మద్ సమీన్ సుల్తానా, అల్లాడి ఆదిత్యమణి, ఎ.దిలీప్, షేక్ జానీబాషా, షేక్ మస్తాన్‌వలి, షేక్‌హబీబుల్లా, మాచర్ల సతీష్, వి.వినోద్‌కుమార్, శామ్యూల్, కంబాల రాజు, మొహమ్మద్ రియాజ్‌ఖాన్, బి.కోటేశ్వరరావులను నియమించారు.

మాజీ మంత్రి సత్యనారాయణపై కఠిన చర్యలు తీసుకోవాలి

పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదులు ఫిర్యాదు

గుంటూరుఈస్ట్: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు న్యాయవాదులు నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవీంద్ర నాయక్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. మహిళ న్యాయవాది బడి మంజుల మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ విశాఖపట్నంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

మంత్రి రోజాపై దిగజారి అసత్య ఆరోపణలు చేశారన్నారు. ఈ వ్యాఖ్యలపై మహిళ కమిషన్‌కు ఫిర్యాదు చేయబోతున్నట్లు చెప్పారు. పోలీసులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వట్టి జొన్నల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ సత్యనారాయణ మంత్రి రోజాకు క్షమాపణలు చెప్పాలని లేదంటే తగిన బుద్ధి చెప్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో పిట్టు విజయలక్ష్మి, బాలాత్రిపుర సుందరి, కళ్లం వెంకటరమణా రెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, టి.ప్రకాష్, వేముల ప్రసాద్, కాంత్రి, ఏ.శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

టీడీపీ నాయకులు, కార్యకర్తలకు నోటీసులు

గుంటూరు ఈస్ట్: పోలీసుల నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పట్టాభిపురం పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నట్లు సమాచారం. ఈనెల 16వ తేదీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు రింగ్‌రోడ్డులో శుభం కల్యాణమండపం వద్ద పెద్ద సంఖ్యలో వచ్చి 30 పోలీసు యాక్ట్ నిషేధాజ్ఞలు ఉల్లంఘించారు. పోలీసులు అడ్డుగా పెట్టిన బారికేడ్‌లు తోసివేసి లాడ్జిసెంటర్ వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఈ ఘటనపై అదేరోజు పోలీసులు కేసు నమోదు చేశారు. వీడియోల ద్వారా నాయకులు, కార్యకర్తలను గుర్తించి శనివారం సుమారు 40 మందికి పోలీసులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మిగిలిన వారికి త్వరలో నోటీసులు జారీ చేస్తారని సమాచారం. అదే రోజు లాడ్జిసెంటర్‌లో నిషేధాజ్ఞలు ఉల్లంఘించి ధర్నా చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ధర్నాలో పాల్గొన్న వారికి అరండల్‌పేట పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నట్లు సమాచారం.

ఇంటి ముంగిటకు నాణ్యమైన వైద్యం

- జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి
- జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం

కొల్లిపర: రోగాలబారిన పడిన వారి ఇంటి వద్దకు వైద్యులే స్వయంగా వెళ్లి సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు. శనివారం కొల్లిపర- 3 విలేజ్ హెల్త్ సెంటర్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరై ప్రారంభించారు. కలెక్టర్ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి రోగులను గుర్తించి వారికి వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వటం జరుగుతుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 16 సెంటర్లలో ఉచితంగా పేదవారికి ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. దీర్ఘ కాలిక రోగులకు అవసరమైతే మెరుగైన వైద్యం కోసం వెంటనే జిల్లా వైద్యుల వద్దకు రోగులను పంపించటం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే సీఎం జగనన్న ఆరోగ్యశ్రీ ద్వారా అనే వైద్య విధానంలో నూతన మార్పులు చేసి పేదవారికి మరింత చేరువ చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడటమే వైఎస్సార్ సీపీ లక్ష్యం అని అన్నారు. ప్రతి పేదవాడికి ఎటువంటి ఖర్చు లేకుండా పూర్తి స్థాయిలో ఆరోగ్యం అందించి రానున్న రోజులల్లో రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే సీఎం జగన్ సంకల్పం అని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు అవుతు పోతిరెడ్డి, సర్పంచి పిల్లి రాధిక, ఉపసర్పంచి అవుతు కృష్ణారెడ్డి, ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, మండల వైద్యాధికారి లక్ష్మీసుధ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, పార్టీ నాయకులు కల్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

జగనన్న ఆరోగ్య సురక్ష ఓ బృహత్తర కార్యక్రమం

- జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- కురగల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

కురగల్లు(మంగళగిరి): జగనన్న ఆరోగ్య సురక్ష అనేది ప్రజలకు వైద్య సేవలందించడంలో ఓ బృహత్తర కార్యక్రమం అని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.రాజకుమారి అన్నారు. మండలంలోని కురగల్లులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సేవలు పొందడం అభినందనీయమని చెప్పారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష అమలు చేస్తున్నట్లు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట ఆరోగ్య రక్ష అన్నారు. ప్రత్యేక క్యాంపులలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడంతో పాటు ఇంకా మెరుగైన చికిత్స అవసరమనుకుంటే ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు తరలించి వైద్య సేవలందించడం జరుగుతుందని వివరించారు. గ్రామంలో 800 మందికిపైగా ప్రజలు రిజిస్టార్ చేయించుకోగా టోకెన్‌లు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. టోకెన్ పొందిన ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ పద్మావతి, క్యాంపు ప్రత్యేక అధికారి మార్కెట్ యార్డు సెక్రటరీ మాధవరావు, సెక్రటరీ ఆదినారాయణ, డాక్టర్లు డి.శ్రీనివాస్, పి.శివపార్వతి, ఎస్.వసుంధర, సతీష్, ప్రవల్లిక, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న జేసీ రాజకుమారి

3న టెక్స్‌టైల్స్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు రూరల్: నల్లపాడులోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్స్ టైల్ టెక్నాలజీ కళాశాలలో కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రమణబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులందరికీ తమ మూడున్నర సంవత్సరాల వ్యవధిగల టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో మంగళవారం ఉదయం 11 గంటల నుండి స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అర్హత సర్టిఫికెట్లు రూ.5,800 అడ్మిషన్ ఫీజు తీసుకొని కళాశాల ప్రిన్సిపాల్‌ని సంప్రదించాలన్నారు. మూడున్నర సంవత్సరాల టెక్స్ టైల్ డిప్లొమా కోర్సులో మొదటి నాలుగు సెమిస్టర్లు కాలేజీ, ఐదు ఆరు సెమిస్టర్లు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉంటుందని చెప్పారు. ఈ ట్రైనింగ్ కాలంలో విద్యార్థికి పరిశ్రమలు నెలకు రూ.7,000 నుంచి రూ. 10,000 వరకూ స్టైఫండ్ ఇస్తునాయన్నారు. చివరి ఏడో సెమిస్టర్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు జరుగుతాయని తెలిపారు. సూపర్ వైజర్లుగా నూరుశాతం జాబ్ ప్లేస్‌మెంట్ కల్పిస్తూ సగటున ప్రతి విద్యార్థికి ప్రారంభ జీతం రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ వివరాలకు అడ్మిషన్స్ విభాగ అధ్యాపకులు యు.రాధాకృష్ణ 8500724006, జి.లక్ష్మీజ్యోతి 94918 75206 సంప్రదించాలని కోరారు.